క్లుప్తంగా

గౌరవ డాక్టరేట్ ప్రదానం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన శ్రీరామకృష్ణ వైదిక ధర్మపీఠం, వైదిక స్మార్త ఆగమ వేద సంస్కృత పాఠశాల వ్యవస్థాపకులు శీర్లవంచ కృష్ణామాచార్యులుకు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. వైదిక పీఠం ద్వారా వివిధ కులాలకు చెందిన పేద, మధ్య తరగతి పిల్లలకు ఉచితంగా సంస్కృత వేద విద్యను బోధిస్తూ సేవలు అందిస్తున్నందుకు గౌరవ డాక్టరేట్ అందిస్తున్నట్లు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ పేర్కొంది.

విజయ పాల డెయిరీ కార్యవర్గం ఎన్నిక

రాజంపేట: తలమడ్ల విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సావుసాని రాజిరెడ్డి, డైరెక్టర్లుగా కుమ్మరి పండరి, సావుసాని నరసింహారెడ్డి, గంగిరెడ్డి, ఆంజనేయులు, సావుసాని మధుసూదన్ రెడ్డి, సావుసాని బాల్‌రెడ్డి, నారాయణలు ఎన్నికయ్యారు.

ఏబీవీపీ నాయకుల రాస్తారోకో



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి తహసీల్ ఎదుట ఏబీవీపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డిలో పెన్షనర్స్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. హైద్రాబాద్‌లోని మెడివిజన్ ఆస్పత్రి సహకారంతో ఉచితంగా 162 మందికి కంటి పరీక్షలు చేశారు. అనంతరం 8 మందికి కంటి ఆపరేషన్ల కోసం రిఫర్ చేశారు. మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కిష్టయ్య, కార్యదర్శి కృష్ణమూర్తి, వైద్యులు గిరిశ్‌రావత్ తదితరులున్నారు.

కరాటే క్లాసులు ప్రారంభం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థినులకు కరాటే క్లాసులను ప్రారంభించారు. బాలికలకు రక్షణ కోసం పాఠశాలలో కరాటే క్లాసులను ప్రారంభించినట్లు హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి తెలిపారు. వారానికి రెండు రోజులపాటు మూడునెలలపాటు కరాటేక్లాసులు నిర్వహించనున్నట్లు చెప్పారు. పీడీ సభాత్ కృష్ణ, కరాటే మాస్టర్ యాదగిరి ఉన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు. మోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై యువత బీజేపీ సభ్యత్వం తీసుకోవడానికి ముందుకు వస్తున్నారన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రవీందర్‌రావు అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేశారు. వంద మంది సభ్యత్వం చేసిన కార్యకర్తలకు ఉచితంగా క్రియాశీల సభ్యత్వం చేయనున్నట్లు చెప్పారు. నాయకులు బాలకిషన్, దేవేందర్, సతీష్, రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు తదితరులున్నారు.

టాయిలెట్ల నిర్మాణానికి సాయం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం టాయిలెట్ల నిర్మాణానికి సాయం చేస్తానని బీజేపీ నాయకులు పైడి ఎల్లారెడ్డి అన్నారు. అలాగే వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి 300 సంచుల సిమెంటు బస్తాలను ఉచితంగా ఇస్తానని మంగళవారం ఆయన చెప్పారు. అనంతరం అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మెన్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ,పైడి ఎల్లారెడ్డిని సన్మానించారు. నేతలు నునుగొండ శ్రీనివాస్, కిష్టయ్య తదితరులున్నారు.



రాజంపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న కామారెడ్డి ఆర్డీవో రంగనాథ్‌రావు



ఎల్లారెడ్డిలో.. ఆర్డీవో ప్రభాకర్



గాంధారిలో శిక్షణ ఇస్తున్న టీవోటీలు



సదాశివనగర్‌లో.. ఎంపీడీవో సంతోష్‌కుమార్



భిక్కనూరులో..

సమగ్ర సర్వేపై శిక్షణ

సమగ్ర కుటుంబ సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా సర్వే ఎలా చేయాలనే విషయమై ఎన్యుమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా మొదటి దశలో ఇంటింటికి తిరిగి స్టిక్కర్లను అతికించాలన్నారు. ఈ నెల 9 నుంచి రెండోదశగా ఇంటింటికి వెళ్లి వివరాలను సేకరించాలన్నారు. సర్వేకు సంబంధించి ప్రతి అంశాన్ని పూర్తి స్థాయిలో నమోదు చేయాలని చెప్పారు. సర్వేపై ప్రజలకు అనుమానాలుంటే నివృత్తి చేయాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నాగిరెడ్డిపేటలో ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో ప్రభాకరచారి



బిచ్కుందలో..



పెద్దకొడప్‌గల్ రైతు వేదికలో..



అచ్చంపేటలో శిక్షణ ఇస్తున్న ట్రైనర్ భాస్కర్‌గౌడ్



నస్రుల్లాబాద్‌లో శిక్షణకు హాజరైన ఎన్యుమరేటర్లు



దోమకొండలో.. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చంద్రకాంత్ రెడ్డి, సుభాష్ రెడ్డి

రామారెడ్డి: 68వ ఎస్జీఎఫ్ రాష్ట్ర అండర్–14 బాలికల ఖోఖో టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. మొదటి స్థానంలో ఆదిలాబాద్ జిల్లా, రెండో స్థానంలో రంగారెడ్డి, మూడో స్థానంలో నిజామాబాద్ జట్లు నిలిచాయి. రాష్ట్రస్థాయిలో జరిగే ఖోఖో క్రీడలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోసానిపేట నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికైయారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, వడ్డేపల్లి సుభాష్‌రెడ్డిలు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ జెడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు క్రషింగ్ ప్రారంభం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. క్రషింగ్ ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే సర్పంచ్‌లకు కష్టాలు

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే సర్పంచ్‌ల జీవితాలతో ఆడుకున్నారని, వారు ఆత్మహత్యలు చేసుకున్నా పట్టించుకోలేదని కామారెడ్డి కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ధాత్రిక సత్యం మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో మాజీ సర్పంచుల బకాయిలను చెల్లించకుండా కష్టాలు పెట్టిన బీఆర్‌ఎస్ నాయకులు ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సర్పంచులు వారి భార్యల పుస్తెలమ్మి పనులు చేశారని, వారికి బిల్లులివ్వకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేధించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు.

దాశరథికి ఘన నివాళులు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివంగత తెలుగు కవి దాశరథి కృష్ణామాచార్య వర్ధంతి నిర్వహించారు. కళాశాలలో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ శంకరయ్య మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనను ధిక్కరించిన కవి అని కొనియాడారు. జైలు జీవితంలో జైలు గోడలపై నాతెలంగాణ కోటి రతనాల వీణ అని రచించారని అన్నారు. ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, ప్రభాకర్, కృష్ణప్రసాద్ ఉన్నారు.

ఆన్‌జాబ్ శిక్షణతో ఎంతో అనుభవం



భిక్కనూరు: వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఆన్‌జాబ్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలో ఓకేషనల్ విద్యార్థులు శిక్షణ పొందుతున్న ఆన్‌జాబ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. మోటార్‌వైండింగ్, బ్యాంకుల్లో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓకేషనల్ అధ్యాపకులు జంగం భానుప్రకాష్, అశోక్‌గౌడ్, శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



కామారెడ్డి అర్బన్: సంగారెడ్డిలో ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు, కాంస్య పతకాలు సాధించారు. జిల్లాకు చెందిన జి.నిషాంత్ బంగారు పతకం, శ్రియాన్స్, రిక్షితలు కాంస్య పతకాలు సాధించారు. పతకాలను సాధించిన క్రీడాకారులను కోచ్‌లు కామిండ్ల నవీన్, కామిండ్ల రాజయ్య, దీకొండ సాత్విక్, గోసాని రాజేందర్‌లు అభినందించారు.

ఆడపిల్లలపై చిన్నచూపు వద్దు



భిక్కనూరు పీహెచ్‌సీలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు దివ్య, ఆశావర్కర్లు



లింగంపేటలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు హిమబిందు

భిక్కనూరు: ఆడపిల్లలపై చిన్నచూపు చూడవద్దని, వారి చదువు పట్ల అశ్రద్ధ చేయవద్దని భిక్కనూరు పీహెచ్‌సీ వైద్యులు దివ్య అన్నారు. మంగళవారం భిక్కనూరు ప్రభుత్వాస్పత్రిలో ఆశా డే సందర్భంగా బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లింగంపేట పీహెచ్‌సీలో..

లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం 'బేటి బచావో బేటి పడావో' కార్యక్రమంపై వైద్యులు హిమబిందు ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో స్త్రీలు లింగ నిర్ధారణ చేసుకోవడాన్ని, అబార్షన్లు చేసుకోవడాన్ని అడ్డుకోవాలన్నారు. లింగ నిర్ధారణ చట్టవిరుద్ధం ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సూపర్‌వైజర్లు ఫరీదా, చంద్రకళ, యాదగిరి, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు ఆర్టీసీ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ ముందు మంగళవారం నిరసన తెలిపారు. తమ ప్రధాన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ విడుదలైన గెజిట్ ఆధారంగా తక్షణమే ఉద్యోగులకు అపాయింటెడ్ డేట్ ప్రకటించి జీవో విడుదల చేయాలన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలన్నారు. నాయకులు వీడీ దాస్, కృష్ణమూర్తి, శేఖర్, క్రాంతి, సుభాష్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ప్రేమ్ తదితరులున్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపర్చాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో సామర్థ్యాలను మరింత మెరుగుపర్చాలని జిల్లా సెక్టోరియల్ అధికారులు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు సూచించారు. గోలిలింగా ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. దీంతోపాటు విద్యార్థులలో సామర్థ్యాలను పర్యవేక్షించారు. గోపాల్‌పేట కాంప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎం వెంకట్రాంరెడ్డి, సీఆర్పీ రాజయ్య, గోలిలింగాల పాఠశాల హెచ్‌ఎం దేవయ్య, ఉపాధ్యాయులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని 8, 9,10వ వార్డుల పరిధిలో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ మంగళవారం ప్రారంభించారు. పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. కౌన్సిలర్ నీలకంఠం, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్, సుభాష్ అప్ప, పోచయ్య తదితరులున్నారు.



ఎల్లారెడ్డిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీకాంత్

భక్తుల విరాళాలతో సీసీ రోడ్డు నిర్మాణం

రామారెడ్డి: ఇసన్నపల్లి కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు ఆలయ ఈవో ప్రభుగుప్తా తెలిపారు. భక్తుల నుంచి విరాళాల సేకరణకు మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, కాలభైరవ స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గంజి సతీష్ గుప్తా కృషి చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు కిరణ్ కుమార్ రెడ్డి, జంగం లింగం, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్యాలయం తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని మంగళవారం ఏపీడీ వామన్‌రావు తనిఖీ చేశారు. ప్రస్తుతం ఏయే పనులు జరుగుతున్నాయని, ఎంత మందికి జాబ్‌కార్డులు ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయా అని తదితర విషయాలు తెలుసుకున్నారు. రికార్డులు, కంప్యూటర్లలో పొందుపరిచిన సమాచారాన్ని పరిశీలించారు. ఏపీవో మల్లేశ్, టెక్నికల్ అసిస్టెంటులు, సిబ్బంది ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు అర్థం చేసుకోవాలి

కామారెడ్డి అర్బన్: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాల్సింది పోయి మరింతగా కష్టాలకు గురి చేయడం తగదని ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు జి.లచ్చయ్య అన్నారు. అసోసియేషన్ జిల్లా సమావేశం మంగళవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వి.హన్మంతురెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. డీఏ బకాయిలను 17 వాయిదాల్లో చెల్లిస్తామని అనడం అన్యాయమన్నారు. పీఆర్‌సీ, నగదు రహిత ఆరోగ్య బీమా అంశాలపై ప్రభుత్వం మాట్లాడకపోవడాన్ని తప్పుపట్టారు. నాయకులు విజయరామరాజు, శంకరయ్య, నరసింహారెడ్డి, సత్తయ్య, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

కామారెడ్డి అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పరిరక్షణ సమితి జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో నిర్వహించారు. సంఘం జాతీయ గౌరవ అధ్యక్షులు గిద్దె భాగ్యమ్మ మృతికి సంతాపంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామిలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.




కొత్తగా ఎన్నికైన పరిరక్షణ సమితి జిల్లా నాయకులు

జిల్లా కమిటీ నూతన అధ్యక్షులు జాదవ్ పండరి, ఉపాధ్యక్షుడు లకావత్ మోహన్, బైండ్ల భూపతి, గుడిపల్లి సుమతి, దోమకొండ మహేష్, కవిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నాటు కోడి పిల్లల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ మహిళా సంఘానికి మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో నాటు కోడి పిల్లలను పంపిణీ చేశారు. నాటు కోళ్ల పెంపకం మదర్ యూనిట్‌లో భాగంగా 5 రోజుల నుంచి 45 రోజుల పాటు కోడి పిల్లల పెంపకంపై ఆసక్తి ఉన్న మహిళలకు నాటు కోడి పిల్లలు సరఫరా చేయనున్నట్లు ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ తెలిపారు. డీపీఎం మురళీకృష్ణ, గ్రామ సంఘం అధ్యక్షులు గంగవ్వ, తదితరులున్నారు.

నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలి

రామారెడ్డి: వడ్ల కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలని రామారెడ్డి తహసీల్దార్ సువర్ణ సూచించారు. అనంతరం కొనుగోలు కేంద్రంలోని సన్న రకం వడ్లను పరిశీలించారు. రామారెడ్డి వ్యవసాయ విస్తర్ణాధికారి రాకేష్, పోసానిపేట ఏఈవో నికిత రైతులు పాల్గొన్నారు.

కూలిపోయిన కంపోస్ట్ షెడ్ పరిశీలన



పెద్దకొడప్‌గల్(జుక్కల్): బూరుగుపల్లి శివారులో నిర్మించిన కంపోస్ట్ షెడ్ గత వర్షాకాలంలో ఈదురు గాలులకు కూలిపోవడంతో మంగళవారం జెడ్పీ సీఈవో చందర్ నాయక్ పరిశీలించారు. ఎలా కూలిపోయిందని ఇరిగేషన్ ఏఈ సుకుమార్ రెడ్డితో విచారణ జరిపారు. కంపోస్ట్ షెడ్ పునర్నిర్మాణం కోసం ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామని చందర్ నాయక్ తెలిపారు. కార్యదర్శి సాయిలు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలగకుండా చూడాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసీల్దార్ దశరథ్ తెలిపారు. మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పెద్దకొడప్‌గల్, చిన్నతక్కడ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆర్ఐ అంజయ్య రైతులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో రెండు నెలలకు సంబంధించిన హుండీలను మంగళవారం దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ విజయ రామారావు సమక్షంలో లెక్కించారు. మొత్తం హుండీలను లెక్కించగా రూ.2లక్షల 95 వేల 958 వచ్చినట్లు ఈవో శ్రీధర్ రావు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, అర్చకులు, చుక్కాపూర్, లింగన్నపేట సేవా సమితి మహిళలు ఉన్నారు.

విండో సిబ్బందిపై ఆరోపణలు తగవు

భిక్కనూరు: అంతంపల్లి సింగిల్ విండో సిబ్బందిపై పలువురు తప్పుడు ఆరోపణలు చేశారని, ఇది తగదని విండో చైర్మన్ వలకొండ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. రాజకీయ దురుద్దేశంతో కొందరు తప్పుడు ఆరోపణలు చేశారని, ఇది వారికి తగదన్నారు. ఆరోపణలు మానుకుని విండో అభివృద్ధికి పాటుపడాలని ఆయన హితవు పలికారు.